RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in






సంపుటి -13 సంచిక - 439 | 2 ఆదివారం ఆగస్టు 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--


### భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

### - ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో

# గర్వకారణం

### : ప్రధాని మోదీ

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన 'థింసా' ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త 'రన్‌వే'గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక 'లాంచ్‌ప్యాడ్' అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. "అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం" అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా



అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## అసెంబ్లీలో విద్వేష ప్రసంగాలకు చెక్

### : తెలంగాణ స్పీకర్ ఛాంబర్‌లో కమిటీ కీలక భేటీ



అసెంబ్లీలో విద్వేషపూరిత, రెచ్చగొట్టే వ్యాఖ్యలను నిరోధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సన్నాహకాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్‌లో సెలెక్ట్ కమిటీ చైర్మన్, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈరోజు కీలక సమావేశం జరిగింది. ఈ భేటీకి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవ లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు హాజరయ్యారు. సమావేశంలో విద్వేష ప్రసంగాలు, క్రైమ్ బిల్లు ప్రతిపాదనలపై సమగ్రంగా చర్చించారు. సమావేశం అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ... అసెంబ్లీ పరిధిలో సభ్యులు భావప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకుంటూనే, ఇతరులను వ్యక్తిగతంగా దూషించడం లేదా విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా ఉండేలా బలమైన చట్టం తీసుకురావడమే తమ కమిటీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. శాసనసభ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఈ క్రైమ్ అండ్ హేట్ స్పీచ్ బిల్లుపై పూర్తి నివేదికను అసెంబ్లీకి సమర్పించే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వారం రోజుల్లో కమిటీ మరోసారి సమావేశం కానుంది. వివిధ రాజకీయ పార్టీలతో పాటు సమాజంలోని ప్రముఖులు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని నివేదికను తుదిరూపు ఇస్తామన్నారు. ఈ చట్టం ఎవరి హక్కులనూ కాలరాయదని, కేవలం సభ గౌరవాన్ని, వ్యక్తుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకేనని భరోసా ఇచ్చారు.

## నాపై కోపంతోనే సొరంగం ఆపారు

### : కేసీఆర్‌పై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఫైర్



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తనపై ఉన్న రాజకీయ కక్షతోనే శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం పనులను గతంలో కేసీఆర్ ఉద్దేశపూర్వకంగా విస్మరించారని ఆయన ఆరోపించారు. శనివారం నల్గొండ జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించిన మంత్రి, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ, "2007లోనే అమెరికా నుంచి యంత్రాలు తెప్పించి సొరంగం పనులు ప్రారంభిస్తే, కేవలం నాకు పేరు వస్తుందనే దురుద్దేశంతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వాటిని నిలిపివేశారు. అప్పట్లో ఆ పనులను కొనసాగించి ఉంటే రూ.1,000 కోట్లతో రెండేళ్లలోనే పూర్తయ్యేవి. నేను ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కేసీఆర్ కనికరించలేదు" అని ఆవేదన వ్యక్తం చేశారు. సొరంగం పనులు పూర్తయి ఉంటే, ప్రస్తుత కరవు పరిస్థితుల్లోనూ నల్గొండ ప్రాంతంలోని 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, తాము అమెరికాకు వెళ్లి కాంట్రాక్టర్‌కు రూ.300 కోట్లు చెల్లించి పనులను పునరుద్ధరించామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో సొరంగం పనులు పూర్తి చేసి, రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. 2028 జూలై నాటికి ఈ సొరంగాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయనందుకు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు. వారి వైఫల్యం వల్లే ఈ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడ్డారని, అందుకే గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. రానున్న ఎన్నికల నాటికి తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.

### వాట్సాప్ అంకుల్స్‌పై

## ఇన్‌స్టా పిల్లలు గెలిచారు

### : కేటీఆర్



వచ్చే ఎన్నికల్లో 50 శాతానికి పైగా జెన్-జీ తరం ఓటర్లే కీలక పాత్ర పోషించబోతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇటీవల నీట్ పరీక్ష వైఫల్యంపై జరిగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' విజయం సాధించారని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మారుతున్న రాజకీయ సమీకరణాలు, యువతరం ప్రాధాన్యతపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

"యువతరం సరికొత్త రీతిలో ఢిల్లీలో కదం తొక్కింది. ఎవరితోనైతే ఘర్షణకు వెళ్లకూడదో, ప్రధాని మోదీ సరిగ్గా వారితోనే తలపడ్డారు. ఇటీవల జరిగిన పరిణామాల్లో 'వాట్సాప్ అంకుల్స్'తో సాగిన పోరులో 'ఇన్‌స్టా పిల్లలు' ఎలా పైచేయి సాధించారో దేశం మొత్తం చూసింది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్ర మోదీ సైతం అర్ధరాత్రి సమయంలో ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా లేకపోతే పాలకుల్లో జవాబుదారీతనం ఉండేది కాదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. నేటి యువత వార్తాపత్రికలు చదవడం గానీ, టీవీ ఛానెళ్లు చూడటం గానీ తగ్గించారని, 18 నుంచి 24 ఏళ్ల మధ్య వయసున్న వారు వార్తలను సైతం రీల్స్ రూపంలోనే వీక్షిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి..

### - పరిస్థితిని స్వయంగా పర్యవేక్షించిన మంత్రి సీతక్క



ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయారు. ఈ నేపథ్యంలో, మంత్రి సీతక్క స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు దిగారు. భద్రాచలం ఎగువన ఉన్న మంగపేట మండల కేంద్రానికి ఈ ఉదయం చేరుకున్న ఆమె... గోదావరి ఉద్ధృతిని, కరకట్ట పనుల పురోగతిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు ఏ మేరకు ముంపునకు గురయ్యాయనే వివరాలను రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఐబీ అధికారులతో మాట్లాడి ఆరా తీశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పొద్మూరు, ముస్లిం వాడ, బీసీ కాలనీ పరిధిలోని ముంపు బాధితుల కోసం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంత్రి సందర్శించారు. నిర్వాసితులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజన, వసతి సౌకర్యాలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. గోదావరి ఉద్ధృతి తగ్గేవరకు అధికారులు ఎవరూ హెడ్‌క్వార్టర్స్ వదలి వెళ్లకుండా నిరంతరం అందుబాటులోనే ఉండాలని, నిర్వాసితులకు అవసరమైన సహాయక చర్యలు త్వరితగతిన అందించాలని సీతక్క ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న లోతట్టు ముంపు పరిస్థితులపై తహసీల్దార్ తోట రవీందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ఎంపీడీవో భద్రులు మంత్రికి నివేదించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, సీనియర్ నాయకులు మైల జయరాంరెడ్డి, వెంకట్ రెడ్డి, భగవాన్ రెడ్డి, మల్లయ్య, పెద్ది నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ అడ్మిషన్ల గడువు 15 వరకు పొడిగింపు



ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్ల గడువును ఇంటర్‌బోర్డు మరోసారి పొడిగించింది. ఈ నెల 15 వరకు అవకాశం కల్పించింది. ఇప్పటి వరకు అడ్మిషన్లు పొందనివారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్‌బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ తెలిపారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in



# బోనాల ఉత్సవాలకు చెక్కుల పంపిణీ ఏఎల్ఆర్

## - ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డితో పాటు పాల్గొన్న కెఎల్ఆర్

## - తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాలు ప్రతీక: కిచ్చెన్న

( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి ఆచారి ఆగస్టు 01:)
జిహెచ్ఎంసి డివిజన్ జిల్లెలగూడ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బోనాల ఉత్సవాల చెక్కులను రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డితో కలిసి మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి.. ఆలయ కమిటీలకు అందజేశారు.
ఈ సందర్భంగా కెఎల్ఆర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు రూ. 17.50 లక్షలకు పైగా సీఎం రేవంత్ రెడ్డి మన నియోజకవర్గానికి నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. భవిష్యత్ తరాలకు బోనాల ఉత్సవాల గురించి తెలిసేలా ప్రతీ




ఆడబిడ్డ కృషి చేయాలని.. ఆలయాల కమిటీలు సమన్వయం చేసుకోవాలని లక్ష్మారెడ్డి సూచించారు. బోనాల పండుగ ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఆలయాలు పరిశీలన చేయాలని కిచ్చెన్నగారు కోరారు. అంతకుముందు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ యువ సేన ఆధ్వర్యంలో సీడీ ఆవిష్కరించారు.

# న్యూ కాకతీయ ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక

## వంచనగిరిలో నూతన బాధ్యతలు చేపట్టిన పదాధికారులు




గీసుగొండ, ఆగస్టు 1 హైదరాబాద్ ఎస్టేట్:
వంచనగిరి న్యూ కాకతీయ ఆటో యూనియన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా మోర్తాల గోపాల్, అధ్యక్షుడిగా కొమ్ముల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడిగా బొల్లం శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆటో డ్రైవర్ల యూనియన్ సంఘం అధ్యక్షుడిగా అడవాల అఖిల్, ఉపాధ్యక్షుడిగా అమీర్శెట్టి నర్సయ్య బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అడవాల అఖిల్ మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన యూనియన్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యుల సంక్షేమం, ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం, యూనియన్ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ అందరి సహకారంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.


# టిటిడి సర్కిల్‌లో డ్రైనేజీ సమస్య.. ప్రజల అవస్థలు

## - స్వల్ప వర్షానికే రోడ్డుపై మురుగునీరు..

## - శాశ్వత పరిష్కారం కోరుతున్న స్థానికులు

హనుమకొండ, ఆగష్టు 1 హైదరాబాద్ ఎస్టేట్:
హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌టిటిడి సర్కిల్ వద్ద డ్రైనేజీ సమస్య తీవ్ర అసౌకర్యానికి కారణమవుతోంది. స్వల్ప వర్షం కురిసినా డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపైకి పొంగిపొర్లి గంటల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
ప్రధాన కూడలిలో మురుగునీరు నిల్వ ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని, వర్షం కురిసిన ప్రతిసారీ ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని స్థానికులు వాపోతున్నారు. పారిశుద్ధ్య సమస్యలతో పాటు ప్రజారోగ్యానికి కూడా ముప్పు ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న హనుమకొండలో ఇలాంటి సమస్యలు కొనసాగడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో పాటు సంబంధిత అధికారులు వెంటనే ప్రాంతాన్ని పరిశీలించి డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో శుభ్రపరచడంతో పాటు మురుగునీరు రోడ్డుపైకి రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





# విద్యార్థులకు సీఎం క్షమాపణ చెప్పాలి

## కనుకుంట్ల రంజిత్ కుమార్

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్



వరంగల్, ఆగస్టు 1 హైదరాబాద్ ఎస్టేట్:
తెలంగాణ విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలు వారి మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. తెలంగాణ విద్యార్థులు విద్య, ఉపాధి, సాంకేతిక రంగాల్లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రానికి గుర్తింపు తీసుకొస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి విద్యార్థులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం బాధ్యతాయుతం కాదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సంక్షేమం, ఉన్నత విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ ఎన్నికలపై బీజేపీ ఫోకస్..

## - ఓరుగల్లులో మేయర్ పీఠమే లక్ష్యం

## - బూత్ కమిటీల బలోపేతంతో విజయమే లక్ష్యం..

## - పార్టీ శ్రేణులకు గంట రవికుమార్ దిశానిర్దేశం






వరంగల్, ఆగస్టు 1 హైదరాబాద్ ఎస్టేట్:
రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓరుగల్లు కార్పొరేషన్‌లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో సమష్టిగా పనిచేయాలని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై ప్రత్యేక కార్యనిర్వాహణ సమావేశం నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణి రుద్రమదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ వన్నాల వెంకటరమణ, రత్నం సతీష్, గురుమూర్తి శివకుమార్ హాజరై ఎన్నికల కార్యాచరణపై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల్లో విజయానికి బూత్ కమిటీలే కీలకమని పేర్కొన్నారు. ప్రతి బూత్ కమిటీని మరింత బలోపేతం చేసి ఓటర్లతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా, లోపాలను సవరించే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని బూత్ స్థాయిలో వంద శాతం పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, స్థానిక సమస్యలపై ప్రజలతో నిరంతరంగా మమేకం కావాలని సూచించారు. వరంగల్ మున్సిపల్ అభివృద్ధికి సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి బూత్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు సమన్వయంతో పనిచేస్తే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, సర్పంచ్ కన్నయ్య, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌లు, వివిధ మోర్చాల జిల్లా అధ్యక్షులు, మండల ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతిపాదనలపై నిరసన..

# మున్సిపల్ సమావేశంలో ఉద్రిక్తత



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:-
ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అభివృద్ధి పనుల ప్రతిపాదనల అంశం ఉద్రిక్తతకు దారితీసింది. వివిధ వార్డులకు సంబంధించిన అభివృద్ధి ప్రతిపాదనలపై చర్చ జరుగుతున్న సమయంలో 18వ వార్డు కౌన్సిలర్ సిద్ధం భానుప్రియతో పాటు కౌన్సిలర్ గూడూరి గిరి తమ వార్డుల ప్రతిపాదనలను జాబితా నుంచి తొలగించవద్దని గట్టిగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్పించిన ప్రతిపాదనలకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనకు వెంటనే స్పందించాలంటూ ఇద్దరు కౌన్సిలర్లు సమావేశ మందిరంలోనే నేలపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. దీంతో సమావేశంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో సమావేశం కొద్దిసేపు నిలిచిపోయింది. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి మున్సిపల్ కమిషనర్ వై. సుదర్శన్ జోక్యం చేసుకోగా, అనంతరం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి అభ్యంతరాలను పరిశీలించి నిబంధనల మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో నిరసన విరమించి సమావేశం తిరిగి కొనసాగింది.

# వరంగల్‌లో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలి

## - అడిషనల్ కలెక్టర్‌కు రైతు సంఘాల వినతి



వరంగల్, ఆగస్టు 1 హైదరాబాద్ ఎస్టేట్:
రైతుల ప్రయోజనాల దృష్ట్యా వరంగల్‌లో శాశ్వత పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని వరంగల్ పండ్ల మార్కెట్ భూ సాధన కమిటీ ఆధ్వర్యంలో వివిధ రైతు సంఘాల నాయకులు శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గణేష్‌కు వినతిపత్రం సమర్పించారు. గత ఐదేళ్లుగా శాశ్వత పండ్ల మార్కెట్ లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. తెలంగాణలోని పలు జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా రైతులు వరంగల్‌కు పండ్లను హోల్‌సేల్ విక్రయాల కోసం తీసుకొస్తున్నప్పటికీ, శాశ్వత మార్కెట్ లేకపోవడంతో సరైన వేదిక లేకుండా అమ్మకాలు నిర్వహించాల్సి వస్తోందని వివరించారు. వరంగల్ నగర శివారులో ప్రభుత్వ భూమిలో గానీ, అవసరమైతే ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి గానీ సుమారు 30 ఎకరాల్లో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తెలంగాణ రైతు సంఘం కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపల్లి బాబు, ఏఐకేఎఫ్ జిల్లా నాయకుడు ఐత నగేష్, అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఓదెల రాజయ్య, అఖిల భారత కిసాన్ సభ జిల్లా కన్వీనర్ వల్లందాస్ కుమార్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, బండి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పనులపై ఈసీఐ కార్యదర్శి క్షేత్రస్థాయి తనిఖీ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:-
రంగారెడ్డి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియ పురోగతిని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) కార్యదర్శి నవీన్ కుమార్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కిరణ్మయి, తెలంగాణ ఉప ప్రధాన ఎన్నికల అధికారి జయచంద్ర రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో) వై. శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సునీత, ఆదిబట్ల డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ రెడ్డితో కలిసి కొంగరకలాన్, బొంగ్లూర్ గ్రామాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలను అధికారులు సమీక్షించారు. అనంతరం ఓటర్లతో నేరుగా మాట్లాడి ఎస్ఐఆర్2026పై వారికి ఉన్న అవగాహన, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఓటరు జాబితా సవరణలో ప్రతి వివరాన్ని ఖచ్చితంగా నమోదు చేయాలని, నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ నిర్ణీత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఈసీఐ కార్యదర్శి నవీన్ కుమార్ సూచించారు. దీంతో ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా రూపొందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# విద్యార్థి దశలో క్రమశిక్షణ..

## భవిష్యత్తుకు బంగారు బాట



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:- బడంగ్‌పేట్: బడంగ్‌పేట్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మర్రి నిరంజన్ రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలంటే ముందుగా స్పష్టమైన గమ్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణతో నిరంతరం కృషి చేయాలని సూచించారు. విద్యార్థి దశలో అలవర్చుకునే మంచి అలవాట్లు భవిష్యత్ విజయాలకు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం, సమయపాలన, బాధ్యతాయుతమైన ప్రవర్తన కూడా ప్రతి విద్యార్థికి అవసరమని ఆయన అన్నారు. అనంతరం కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథిని సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయం సోషలిజమే

## - ఎండి అబ్బాస్

## - పరకాలలో సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభం

పరకాల, ఆగస్టు 1 హైదరాబాద్ ఎస్టేట్: ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక, సామాజిక అసమానతలకు పెట్టుబడిదారీ విధానమే కారణమని, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు సోషలిజమే ప్రత్యామ్నాయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి అబ్బాస్ అన్నారు. శనివారం పరకాలలో ప్రారంభమైన సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, అమరుడు కామ్రేడ్ రౌతు మనోహర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో ఎండి అబ్బాస్ మాట్లాడుతూ, పెట్టుబడిదారీ విధానం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు తీవ్రమవుతున్నాయని, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, సమాన అవకాశాల కల్పన, సామాజిక న్యాయం సాధనకు సోషలిజం ఆధారిత విధానాలు అవసరమని అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ పరిణామాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూడా ఆయన విమర్శలు చేశారు. దేశంలో నిరుద్యోగం, పేదరికం, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని తెలిపారు. ఆగస్టు 20న దేశవ్యాప్తంగా నిర్వహించే 'జైల్ భరో' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం 'వర్గాలువర్గపోరాటాలు' అంశంపై సీపీఎం రాష్ట్ర నాయకుడు ముడ్ శోభన్ నాయక్ శిక్షణ ఇచ్చారు. శిక్షణా తరగతులకు బొట్ల చక్రపాణి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. లింగయ్య, పరకాల పట్టణ



కార్యదర్శి బొచ్చు కళ్యాణ్, నాయకులు గాదె రమేష్, బొచ్చు ఆదాం, జి. మహేందర్, బి. నారాయణ, ప్రమోద్, దాసరి అనిత, శనిగారపు సంధ్య, రౌతు శ్రీలత, చరణ్ మోహన్, ఏసుబ్ తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన AYS రాష్ట్ర, మండల నాయకులు





హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధి చిట్యాల 1-8-2026
ఈ రోజు చిట్యాల మండల కేంద్రానికి చెందిన ఆకుల నర్సయ్య, రవీందర్ గార్ల తండ్రి గారైన మల్లయ్య మరియు చిలుముల రమణచారి రాజమౌళి గార్ల తండ్రి చిలుముల శేఖరయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు జన్నె యుగేందర్ అధ్వర్యంలో వారి కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలియజేయడం జరింగింది. మృతి చెందిన మల్లయ్య మరియు శేఖరయ్య చిత్ర పటాలకు పూలు వేసి నివాళ్ళు ఆర్పించడం జరిగింది. అనంతరం వారి ఆత్మకు శాంతి చేకూరాలని 2 నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలియజేయడం జరిగింది.. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య జిల్లా ప్రచార కార్యదర్శి రాజేందర్ మాజీ అధ్యక్షులు బొడ్డు ప్రభాకర్, సరిగొమ్ముల రాజేందర్ మండల ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్ మండల నాయకులు గురుకుంట్ల కిరణ్ పాముకుంట్ల చందర్ తదితరులు పాల్గొన్నారు

# సీఎం వ్యాఖ్యలపై బీజేపీ, బీజేవైఎం ఆందోళన

## - విద్యార్థులకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్..

## - వరంగల్‌లో దిష్టిబొమ్మ దహనం



వరంగల్, ఆగస్టు 1 హైదరాబాద్ ఎస్టేట్: తెలంగాణ విద్యార్థులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ వరంగల్ జిల్లా బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం వెంకట్రామ థియేటర్ జంక్షన్‌లో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వ్యాఖ్యలు తెలంగాణ విద్యార్థుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. విద్యార్థులపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని, నైతిక బాధ్యత స్వీకరించి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర కీలకమైందని, రాష్ట్ర అభివృద్ధికి విద్యార్థులు, యువత, ఇంజనీర్లు విశేష సేవలందిస్తున్నారని అన్నారు. అలాంటి వారిని అవమానించేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, యువతతో కలిసి నిరసన కార్యక్రమాలను విస్తరిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం బీజేపీ, బీజేవైఎం నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నం సతీష్ షా, ఓబీసీ రాష్ట్ర నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్, జిల్లా పదాధికారులు, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాయి గార్డెన్స్ అభివృద్ధికి సమిష్టి కృషి..

## - సమస్యల పరిష్కారానికి మాజీ కార్పొరేటర్ హామీ



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:-
బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయి గార్డెన్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైన సందర్భంగా సంఘం ప్రతినిధులు జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా స్పందించిన మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి మాట్లాడుతూ, సాయి గార్డెన్స్ కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో కాలనీని ఆదర్శవంతమైన నివాస ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతి చర్యకు తన వంతు సహకారం అందిస్తానని పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు కూడా కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత, మౌలిక వసతుల మెరుగుదల, ప్రజా సమస్యల పరిష్కారంలో సమిష్టిగా పనిచేస్తామని వెల్లడించారు. స్థానిక ప్రజల సహకారంతో కాలనీ అభివృద్ధిని వేగవంతం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు మదనం శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు హనుమంతరావు పోట్రు, ఉపాధ్యక్షుడు వెంకట్ రమణ, ప్రధాన కార్యదర్శి కె.వి. అనిల్, కోశాధికారి బి. శ్రీధర్, సంయుక్త కార్యదర్శులు ఆర్. సతీష్, ఓం ప్రకాష్, కమిటీ సభ్యులు మధుసూదన్ రెడ్డి, ఎం. వేణు, శివ, బాలాజీ ధుమాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ గాలా2026 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానం అందుకున్న డా. పిట్టా వరప్రసాద్

హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ ప్రతినిధికాకినాడ, ఆగస్టు 1:
ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్ గాలా2026 కార్యక్రమం ఆగస్టు 2, 2026 సాయంత్రం 5.00 గంటలకు కాకినాడలోని కుసుమ సత్య ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించనున్న సందర్భంగా, కార్యక్రమానికి అతిథిగా హాజరు కావాలని జాతీయ హ్యాండ్లూమ్ అధ్యక్షులు శ్రీ పప్పు దుర్గా రమేష్ మరియు ప్రముఖ న్యాయవాది శ్రీ లక్ష్మీ గణేష్ డా. పిట్టా వరప్రసాద్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రముఖులను సన్మానించడంతో పాటు, చేనేత కార్మికుల సంక్షేమం, ఆధునిక మార్కెటింగ్ అవకాశాలు, యువతను హ్యాండ్లూమ్ రంగం వైపు ఆకర్షించే అంశాలపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డా. పిట్టా వరప్రసాద్ గారు ఆహ్వానం అందించిన శ్రీ పప్పు దుర్గా రమేష్, శ్రీ లక్ష్మీ గణేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, చేనేత రంగం రాష్ట్ర సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని, హ్యాండ్లూమ్ రంగ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఆహ్వాన పత్రాన్ని అందజేసిన అనంతరం జ్ఞాపికను అందించి, పరస్పరం శుభాకాంక్షలు తెలియజేశారు.




# అదృశ్యమైన మైనర్ బాలిక నేడు అమ్మానాన్నల వద్దకి..!



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఎల్బీనగర్ ఆగస్టు 1 :
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ బడంగ్పేట్ బాలాజీ నగర్ కు చెందిన మైనర్ విద్యార్థిని శాలిని(17) గత నెల 20న మధ్యాహ్నం నుండి గత 13 రోజులుగా కనిపించకపోవడం కలకలం రేగింది . తల్లిదండ్రుల, పోలీసుల కథనం ప్రకారం చిన్న చిన్న సమస్యలు, తగదాల కారణంగా తల్లిదండ్రులకు చెప్పకుండ ఇంటి నుండి పరారయిన ఈ అమ్మాయి వరుసగా మూడు రోజులుగా కనిపించక పోయేసరికి తల్లిదండ్రులు స్థానిక మీర్పేట్ పోలీస్ స్టేషన్ ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. మీర్పేట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గోవిందస్వామి ఈ అమ్మాయి మిస్సింగ్ కేసును ఈ కేసును నమోదు చేసుకుని తక్షణమే దర్యాప్తు చేపట్టారు. తన పోలీసు సిబ్బందితో అమ్మాయి ఆచూకీ కోసం వెతకడం మొదలుపెట్టారు. చివరికి శనివారం అమ్మాయి ఉన్న ప్రాంతాన్ని గుర్తించినట్లు ఎస్ఐ గోవిందస్వామి తెలిపారు. రేపటి వరకు ఆ అమ్మాయిని వారి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంటుందని ఎస్సై భరోసా ఇచ్చారు.

# ఏపీ అభివృద్ధిపై మోదీ ప్రశంసలు..

## చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసలు కురిపించారు. మిత్రుడు చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ, ప్రధానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ సుదీర్ఘ పోస్ట్ చేశారు. ఏపీ పట్ల ప్రధానికి ఉన్న ఆప్యాయత, ప్రత్యేక శ్రద్ధకు ఇది నిదర్శనమని అన్నారు. 2024లో కూటమి అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో, వ్యవస్థల విధ్వంసంతో వెంటిలేటర్‌పై ఉందని చంద్రబాబు గుర్తుచేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రధాని మోదీ అందించిన అండదండలతోనే రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టగలిగామని, ఒక్కో మెట్టూ ఎక్కుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రధాని ప్రోత్సాహమే బలమైన పునాది అని ఆయన అభివర్ణించారు. పోలవరం, అమరావతి వంటి కీలక ప్రాజెక్టులతో పాటు, కోట్లాది ఆంధ్రుల మనోభావాలను గౌరవిస్తూ విశాఖ ఉక్కు కర్మాగారం పునరుద్ధరణకు, రాయలసీమలో డిఫెన్స్ ప్రాజెక్టుకు, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రధాని అండగా నిలిచారని చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ సంకల్పించిన 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడానికి తమ ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని చేస్తున్న కృషికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఐదు కోట్ల ప్రజలు ఎల్లప్పుడూ అండగా నిలుస్తారని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# ప్రజల సమస్యలను పక్కనపెట్టి దుష్ప్రచారం చేయడం బీఆర్ఎస్ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం

## కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వొడ్నాల శ్రీనివాస్

హైదరాబాద్ ఎస్టేట్ 01ఆగష్టు 2026
మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌పట్టణంలో వర్షాల కారణంగా దెబ్బతిన్న నేషనల్ హైవే363 సర్వీస్ రోడ్డును, కల్వర్టును తెలంగాణ రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి, చెన్నూరు శాసనసభ్యులు గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రత్యక్షంగా పరిశీలించిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా వక్రీకరించి సోషల్ మీడియా, వాట్సాప్ వేదికల ద్వారా దుష్ప్రచారం చేయడం అత్యంత హేయమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్ అన్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే పరిష్కారం చూపాల్సిన ప్రతిపక్షం, సమస్యను వదిలేసి మంత్రి మాటలను కత్తిరించి ప్రచారం చేయడం బీఆర్ఎస్‌కు అలవాటుగా మారింది. ప్రజలకు నిజాలు చెప్పే ధైర్యం లేక, అసత్య ప్రచారాలతో రాజకీయ మనుగడ కోసం తాపత్రయపడటం సిగ్గుచేటు అన్నారు. మంత్రి సంఘటన స్థలంలో ఫోటోగ్రాఫర్‌కు సమస్య తీవ్రత, దెబ్బతిన్న ప్రాంతం స్పష్టంగా కనిపించేలా ఫోటోలు తీయండి. వాస్తవ పరిస్థితిని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కి, కేంద్ర రహదారుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే పనులు మంజూరు చేయించేలా ప్రయత్నిద్దాం అనే ఉద్దేశంతో మాత్రమే సూచనలు చేశారని ఆయన తెలిపారు. ఈ మాటలను పూర్తిగా వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని విమర్శించారు. విమర్శించే వీరు అధికారంలో ఉన్నప్పుడు దీనిని ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుకున్నారని ఎద్దేవా చేశారు. భరత్‌నగర్‌దుబ్బపల్లి సర్వీస్ రోడ్డుపై కుర్మపల్లి చెరువు అవుట్‌ఫ్లో కాలువ కారణంగా ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య



పునరావృతమవుతోందని, గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి చీనా× ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు లేఖ రాశారని గుర్తు చేశారు. సంబంధిత అధికారులు నివేదికలు సమర్పించినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో ఈసారి భారీ వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నిరంతరం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ నిధులు, అనుమతులు తీసుకొస్తున్నారని తెలిపారు. సర్వీస్ రోడ్డు, బాక్స్ కల్వర్ట్, లైటింగ్ వంటి పనులు త్వరితగతిన ప్రారంభించేలా మరోసారి కేంద్ర ప్రభుత్వ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించకుండా, మంత్రి వ్యాఖ్యలను వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో చెన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, క్యాతనపల్లి మున్సిపాలిటీ సమస్యల పరిష్కారానికి కూడా మంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అసత్య ప్రచారాలతో అభివృద్ధిని ఆపలేరని ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పనితో సమాధానం చెబుతుంది. దుష్ప్రచారం చేసే వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. అధికార ప్రతినిధి మొట్టే సుధాకర్, మాజీ జెడ్పిటిసి యాకూబ్ ఆలీ మాట్లాడుతూ క్యాతనపల్లి మున్సిపాలిటీ అభివృద్ధి రాజకీయాలకు అతీతంగా జరగాలంటే అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, పరస్పర విమర్శల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలని బీఆర్ఎస్ పాలకవర్గానికి కోరారు.
ప్రజా ప్రయోజనాలే అందరికీ ముఖ్యమని, అభివృద్ధి పనులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు పల్లె రాజు, కౌన్సిలర్లు గుర్రం శ్రీనివాస్, దాముక శిరీష, భీమ మల్లేష్, కూతురు ప్రభాకర్, మాజీ కౌన్సిలర్ పోలం సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షులు కట్కూరి శ్రీనివాస్ రెడ్డి, సృజన, ప్రధాన కార్యదర్శులు గోపు రాజం, ఏల్పుల సత్యనారాయణ సోషల్ మీడియా ఇంచార్జ్ బొద్దుల ప్రేమ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.




ఈరోజు 42వ వెడ్డింగ్ అనివర్సరీ జరుపుకుంటున్న శ్రీ వరప్రసాద్ గారు, పుష్పరాగం దంపతులకు హైదరాబాద్ ఎస్టేట్ తెలుగు దినపత్రిక తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు మీరు ఇలాగే మరెన్నో వెడ్డింగ్ అనివర్సరీ లు జరుపుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

ఇట్లు
మీ లక్ష్మీనారాయణ
చీఫ్ ఎడిటర్,
హైదరాబాద్ ఎస్టేట్
తెలుగు దినపత్రిక.

# అమీర్ పేట్ కి కేఎల్ఆర్ ఆహ్వానించిన సిహెచ్ యాదయ్య

## మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య



( హైదరాబాద్ స్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణచారి ఆగస్టు 01:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని అమీర్పేట్ గ్రామంలో ఆదివారం బోనాల పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కెఎల్ఆర్) నీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య ఆహ్వానించడం జరిగింది . అనంతరం యాదయ్య మాట్లాడుతూ.. గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించే బోనాలకు కే ఎల్ ఆర్ ని ఆహ్వానించినట్లు తెలియజేశారు.. మహిళల కట్టుబొట్టు తెలంగాణ సాంస్కృతి ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా అంగరంగ వైభవంగా నిర్వహించే ఏకైక పండుగ బోనాల పండుగ మరియు గ్రామ దేవతలను ఆరాధ్య దైవంగా మహిళలు భావించడం తరతరాలుగా ఆచారంగా రావడం జరుగుతుందని ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని ఆహ్వానించినట్లుగా మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు
ఈ యొక్క కార్యక్రమంలో మహేశ్వరం శివగంగా ఆలయ కమిటీ చైర్మన్ అల్లే కుమార్ రవి నాయక్ ఎస్సీ సెల్ మహేశ్వరం నియోజకవర్గము అధ్యక్షులు శ్రీధర్ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# ఏఐడిజిటల్ హ్యూమానిటీస్‌కు జీఎన్ఐటీసీ వేదిక

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:-
జీఎన్ఐటీసీ (గురు నానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్‌స్వయంప్రతిపత్తి)లో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన "ఇన్నోవేషన్స్ ఇన్ డిజిటల్ హ్యూమానిటీస్ త్రూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (×జ×ణనూ×2026)" అనే రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు విజయవంతంగా ముగిసింది. జూలై 31, ఆగస్టు 1 తేదీల్లో జరిగిన ఈ సదస్సులో దేశ, విదేశాలకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పాల్గొని కృత్రిమ మేధస్సు ఆధారిత డిజిటల్ హ్యూమానిటీస్‌లో జరుగుతున్న తాజా ఆవిష్కరణలపై చర్చించారు. సదస్సును జీఎన్ఐటీసీ మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీ ప్రారంభించగా, ముఖ్య అతిథిగా డా. సి. కలైయరాసన్, డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ డా. బి. కేదార్‌నాథ్ పాల్గొన్నారు. సాంకేతిక సమావేశాల్లో ఎన్ఐటీ తిరుచిరాపల్లికి చెందిన డా. వి.కె. కార్తిక ముఖ్యోపన్యాసం చేయగా, ఐఐఐటీడీఎం కాంచీపురంకు చెందిన డా. కె.ఎం.సి. కంధరాజా ప్లీనరీ ఉపన్యాసం అందించారు. సదస్సులో నాలుగు ప్రత్యక్ష సాంకేతిక సెషన్లు, 30 ఆన్‌లైన్ ట్రాక్‌లలో




మొత్తం 262 మంది పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను సమర్పించారు. అంతర్జాతీయ స్థాయి నిపుణులైన శ్రీలంక నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్‌కు చెందిన డా. దర్శనా సమరవీర, రోమేనియాకు చెందిన డా. డానా రాడ్లర్, యూకేకు చెందిన డా. హాతేం అల్-షమియా ప్లీనరీ ప్రసంగాలతో సదస్సుకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చారు. డిజిటల్ హ్యూమానిటీస్‌లో కృత్రిమ మేధస్సు వినియోగం, సమగ్ర విద్యాభివృద్ధి, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ, డిజిటల్ అక్షరాస్యత, నైతిక సాంకేతిక ఆవిష్కరణలు, సుస్థిర సామాజికాభివృద్ధి వంటి కీలక అంశాలపై నిపుణులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సదస్సు విజయవంతం కావడానికి సహకరించిన వైస్ చైర్మన్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ, మేనేజింగ్ డైరెక్టర్ డా. హెచ్.ఎస్. సైనీలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంతర్జాతీయ సదస్సు జీఎన్ఐటీసీని పరిశోధన, ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిచ్చే విద్యాసంస్థగా మరోసారి నిలబెట్టిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# శ్రీ శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా అందరికి ఆహ్వానం పలికిన కాకి ఈశ్వర్ ముదిరాజ్



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి ఆగస్టు 01
తేదీ 02 ఆగస్టు 2026 ఆదివారం రోజున రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో శ్రీశ్రీ మహంకాళి అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి గౌరవనీయులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి విచ్చేస్తున్నారు కాబట్టి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో విచ్చేసి బోనాల పండుగ ఉత్సవాలలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరడమైనది తెలంగాణ ముదిరాజ్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి ఈశ్వర్ ముదిరాజ్

# పేదల భూ సమస్యపై ఎంపీ ఈటల రాజేందర్‌కు ఫిర్యాదు..

## మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఎల్బీనగర్ ఆగస్టు 1: రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండల పరిధిలోని హన్మగల్ హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలోని సర్వే నెం. 255/1 భూముల సమస్యపై మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బాధితులతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని ఆయన నివాసంలో కలిసి ఫిర్యాదు చేశారు.
ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి బాధితుల తరపున మాట్లాడుతూ, సర్వే నెం. 255/1లో మొత్తం 74 ఎకరాల 37 గుంటల భూమి ఉండగా, అందులో సుమారు 18 ఎకరాల భూమికి సంబంధించిన వివాదం నెలకొన్నట్లు తెలిపారు. గతంలో ప్రభుత్వం వ్యవసాయం చేస్తున్న రైతులకు పట్టాలు మంజూరు చేసిందని, అనంతరం కొందరు రైతులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చిన్న చిన్న ప్లాట్లుగా విభజించి పేద కుటుంబాలకు విక్రయించారని వివరించారు. ప్రస్తుతం ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రయత్నం జరుగుతోందని బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు.
ఈ విషయాన్ని ఎంపీ ఈటల రాజేందర్ వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకొని, బాధితులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్లు నవజీవన్ రెడ్డి తెలిపారు .ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజల హక్కులకు భంగం కలిగితే భారతీయ జనతా పార్టీ ప్రజల పక్షాన నిలబడి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని తెలిపారు. పేదల హక్కులను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.
మాజీ కార్పొరేటర్ గారి కార్యాలయం.
హయత్ నగర్ డివిజన్

# పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి..

## ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట సీపీఎం ధర్నా



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:-
సాహెబ్‌నగర్‌లోని సర్వే నంబర్ 71లో ఉన్న సుమారు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఇబ్రహీంపట్నం, కందుకూర్ ఆర్‌డీఓ కార్యాలయాల ఎదుట వందలాది మంది పేదలతో ధర్నా నిర్వహించారు. పలువురి దరఖాస్తులతో కూడిన లబ్ధిదారుల జాబితాను అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, సాహెబ్‌నగర్ భూమిని పేదలకు కేటాయించాలని అనేక సంవత్సరాలుగా ఉద్యమం కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదన్నారు. 2023లో ఉద్యమం చేసిన పేదలపై అక్రమ కేసులు నమోదు చేసి ఐదు రోజుల పాటు జైలుకు పంపినా తమ పోరాటం ఆగలేదని పేర్కొన్నారు. గత ఏడాది కలెక్టరేట్ ఎదుట వేలాది మందితో నిర్వహించిన ధర్నా అనంతరం కలెక్టర్ స్పందించి ఇబ్రహీంపట్నం, కందుకూర్ ఆర్‌డీఓలకు పేదల వివరాలు సేకరించి సర్వే నిర్వహించాలని ఆదేశించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం హామీని అమలు చేయకపోతే ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా నాయకులు ఎం. చంద్ర మోహన్, జగదీష్, డి. కిషన్, బుగ్గ రాములు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్ వెంకన్న నాయకత్వం వహించారు.

## కోర్టు వ్యవహారాల్లో నాణ్యత, సమయపాలనపై సీపీ తరుణ్ జోషి దిశానిర్దేశం






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఆగస్టు 1:- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ కోర్టు డ్యూటీ అధికారులు (సీడీవోలు), స్టేషన్ రైటర్లు, ఈ-కాప్స్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఐఆర్‌లపై నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, చార్జ్‌షీట్లను నిర్ణీత గడువులోగా ఖచ్చితత్వంతో కోర్టులో దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. కోర్టు విధివిధానాలపై పూర్తి అవగాహనతో పనిచేయాలని, పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమన్వయం కొనసాగించాలని సూచించారు. నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్‌బీడబ్ల్యూ) కేసులను వేగంగా అమలు చేయడంతో పాటు, ఈ-సాక్ష్య (e`Sakshya), ఎన్ఏపీ-గ్రిడ్ (NAP`GRID) వ్యవస్థలను సమర్థంగా వినియోగించాలని తెలిపారు. అలాగే పార్ట్-1, పార్ట్-2 రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి నిర్వహించాలని ఆదేశించారు. నాణ్యమైన దర్యాప్తు, సమయపాలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో నేరస్థులకు శిక్షలు పడేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీ (ఎస్‌వోటీ) సైక్ జహంగీర్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ భూపాల్ శ్రీధర్, కోర్టు డ్యూటీ అధికారులు, స్టేషన్ రైటర్లు, ఈ-కాప్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి 3.16 లక్షల చెక్కు అందజేసిన ఎమ్మెల్యే నాయిని..



తేదీ :01.08.2026-జూలైవాడ హనుమకొండ.

వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని 51వ డివిజన్ జూలైవాడకు చెందిన నేరెళ్ల నవీన్ ప్రియాంక దంపతుల కుమారుడు నేరెళ్ల శ్రేయాన్ భార్గవ్ ఇటీవల విద్యుత్ ప్రమాదంలో గాయపడిన ఘటనపై స్పందించిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా మాట్లాడి, బాధిత కుటుంబానికి నష్టపరిహారం అందేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.3,16,000ల ఆర్థిక సాయాన్ని మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు విద్యుత్ శాఖ అధికారులతో కలిసి బాధిత కుటుంబాన్ని వారి నివాసంలో పరామర్శించి, రూ.3.16 లక్షల ఆర్థిక సాయం చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రమాద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా వెంటనే స్పందించి సహాయం అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నెక్కొండ కవిత కిషన్,డివిజన్ ఇంచార్జ్ కొటిల్ రెడ్డి,నాయకులు మానస రామ్ ప్రసాద్,నేపాల్ రెడ్డి,రాజ్ కుమార్ విద్యుత్ శాఖ ఐజు సాంబారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళారంగానికి మరియు సమాజానికి ఆయన అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఓరుగల్లు స్వరాభిషేకం కమిటీ వారు కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్,ప్రముఖ కళాకారుడు, సామాజిక సేవకునడు అయిన ఈగ మల్లేశం గారిని "విశిష్ట కళా సేవ రత్న పురస్కారం" తో సత్కరించారు.

తెలుగు సంస్కృతి, కళల పరిరక్షణలో ఈగ మల్లేశం గారి కృషికి దక్కిన గొప్ప గుర్తింపు ఇది. ఓరుగల్లు (వరంగల్) కేంద్రంగా పనిచేసే స్వరాభిషేకం కమిటీ ప్రతి ఏటా వివిధ రంగాల్లోని ప్రతిభావంతులను, కళాకారులను ప్రోత్సహిస్తూ ఇలాంటి పురస్కారాలను అందజేస్తుంది. ఈ రకమైన సత్కారాలు తోటి




కళాకారులలో నూతన ఉత్సాహాన్ని నింపడమే కాకుండా, భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయి. ఈగ మల్లేశం గారికి ఈ విశిష్ట పురస్కారం




లభించినందుకు సాటి కళాకారులు, అభిమానులు మరియు స్థానిక ప్రముఖులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నారు

# ఎల్ నీవో ప్రభావం ఉన్నప్పటికీ...

## రైతులను ఆదుకుంటాం

### : ఎమ్మెల్యే KR నాగరాజు గారు...



హైద్రాబాద్ ఎస్టేట్ ప్రతినిధి భాస్కర్ హన్మకొండ వర్ధన్నపేట మండల కేంద్రంలోని కోనారెడ్డి చెరువును వర్ధన్నపేట ఎమ్మెల్యే,విశ్రాంత ఐపీఎస్ అధికారి శ్రీ కేఆర్ నాగరాజు గారు స్థానిక నాయకులు,అధికారులతో కలిసి సందర్శించారు.చెరువు ఆయాకట్ట వరకు కట్టపై నడుచుకుంటూ పరిశీలించారు. కొనారెడ్డి చెరువులో ఉన్న జలాల వల్ల వర్ధన్నపేట పరిసరాల ప్రాంతాల్లోని రైతుల వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎల్ నీవో ప్రభావం ఉన్నప్పటికీ రైతులకు వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్వరలో ఈ చెరువు ద్వారా నీటిని విడుదల చేస్తామని అన్నారు. అధికారులు వెంటనే వ్యవసాయానికి సరిపడ సాగునీటిని విడుదల చేయాలని అదేశించారు.త్వరలో కాలువల ఇరువైల ఉన్న చెట్లను సంబంధిత శాఖ అధికారులతో సమన్వయంతో చేసుకొని పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు.చెరువును మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.సంబంధిత శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారిని ఈ చెరువు పరిశీలనకు తీసుకువచ్చి మరింత అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి,జిల్లా అధికార ప్రతినిధి నిమ్మని శేఖర్ రావు,ఇల్లంద మార్కెట్ చైర్మెన్ నరకుడు వెంకటయ్య,ఐనవోలు దేవస్థానం చైర్మెన్ ప్రభాకర్ గౌడ్,సొసైటీ చైర్మెన్ రాజేష్ ఖన్నా,మండల అధ్యక్షులు పోశాల వెంకన్న,పట్టణ అధ్యక్షులు ఈగ దామోదర్,మాజీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ,నియోజకవర్గ ముఖ్య నాయకులు,కౌన్సిలర్లు, సర్పంచులు,మండల,గ్రామ ముఖ్య నాయకులు,కార్యకర్తలు,అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది స్వప్నను పరామర్శించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య



వరంగల్ జిల్లా తేది: 01-08-2026

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారు నిన్న పరమపదించగా, శనివారం వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య నల్లబెల్లిలోని వారి స్వగృహానికి చేరుకుని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి గారి సతీమణి పెద్ది స్వప్నతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

"పల్లవి"

నల్లబెల్లి మట్టిలో
పుట్టిన పేదల పెద్దన్న
నర్సంపేటకు తొలిపొద్దు
పెద్ది సుధనన్న

నల్లబెల్లి మట్టిలో
పుట్టిన పేదల పెద్దన్న
నర్సంపేటకు తొలిపొద్దు
పెద్ది సుధనన్న

"చరణం"

గోదారి నీళ్లతో నర్సంపేట
గొంతును తడిపినవు
యువత భవితకు
మెడికలు కళాశాల
తెచ్చిన ధీరుడివి "నల్ల"

"చరణం"

తెలంగాణ నా సాధన అని
ఉద్యమించిన ఉద్యమకరుడా
నివు లేవని నర్సంపేట
కన్నీరు పెడుతున్నది
నువ్వు పుట్టిన మట్టినేల
నీకోసం చూస్తూ వున్నది "నల్ల"

"చరణం"

వేలాది మందితో
నీ అంతిమయాత్ర
సాగెను పెద్దన్న
మాకు పెద్ద దిక్కు
పెద్ది లేదని కన్నీటి వర్షం
కురిపించే నేల "నల్ల"

రచన
మ్యాదరి సునీల్
గ్లోబల్ ఐకాన్ అవార్డ్ విన్నర్



రచన
మ్యాదరి సునీల్
గ్లోబల్ ఐకాన్ అవార్డ్ విన్నర్

# కామన్వెల్త్ క్రీడలు

## : జూడోలో భారత్ గోల్డెన్ డబుల్.. అస్మిత, హర్ష్‌లకు స్వర్ణాలు



కామన్వెల్త్ క్రీడలు 2026లో భారత జూడోకాలు అద్భుత ప్రదర్శనతో అదరగొట్టారు. జూడోలో భారత్‌కు గోల్డెన్ డబుల్ అందించి దేశ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు. మహిళల 48 కేజీల విభాగంలో అస్మితా దే, పురుషుల 60 కేజీల విభాగంలో హర్ష్ సింగ్ స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని పోడియంపై నిలిచారు. గంట వ్యవధిలో ఒకరి తర్వాత ఒకరు సాధించిన ఈ విజయాలతో గ్లాస్గోలో భారత శిబిరంలో సంబరాలు అంబరాన్నంటాయి. మహిళల 48 కేజీల విభాగంలో గురువారం జరిగిన ఫైనల్స్‌లో అస్మితా దే అద్వితీయమైన పోరాట పటిమను ప్రదర్శించింది. కెనడాకు చెందిన అనుభవజ్ఞురాలైన హీదీ క్వాచ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో అస్మిత 2-1 తేడాతో విజయం సాధించింది. మ్యాచ్ ఆద్యంతం వ్యూహాత్మకంగా ఆడిన అస్మిత, కీలక సమయాల్లో సంయమనం పాటిస్తూ పాయింట్లు సాధించి కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేసింది. టోర్నమెంట్ మొదటి నుంచి నిలకడైన ప్రదర్శనతో ఫైనల్ చేరిన ఆమె, తుది పోరులోనూ అదే జోరును కొనసాగించి బంగారు పతకాన్ని ముద్దాడింది. అస్మిత స్ఫూర్తితో బరిలోకి దిగిన భారత యువ జూడోకా హర్ష్ సింగ్ కూడా సత్తా చాటాడు. పురుషుల 60 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్‌లో అతను పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. ఆస్ట్రేలియాకు చెందిన జోషువా కాట్జ్‌తో జరిగిన టైటిల్ పోరును ఏకపక్షంగా మార్చేశాడు. ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా సాధించే అవకాశం ఇవ్వకుండా, 10-0 తేడాతో చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని గెలుచుకున్నాడు. హర్ష్ వేగం, కచ్చితమైన ఎత్తుగడల ముందు ఆస్ట్రేలియా జూడోకా నిలవలేకపోయాడు. ఈ రెండు స్వర్ణాలతో కామన్వెల్త్ క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 19కి చేరింది. ఇందులో 5 స్వర్ణాలు, 10 రజతాలు, 4 కాంస్య పతకాలు ఉన్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటికే పలు టోర్నీలలో సత్తా చాటిన హర్ష్ సింగ్, అస్మితా దేల విజయాలు దేశంలో జూడో క్రీడకు మరింత ప్రోత్సాహాన్ని ఇస్తాయని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విజయాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# దాయాదీని సైతం కదిలించిన ఇండియన్ బయోపిక్!



బయోపిక్‌లు బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడమే కాదు. ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపుతుంటాయి. సమాజంలో మహిళలు ఏ రంగంలోనైనా రాణించగలరని నిరూపించే కథలు సరిహద్దులు దాటి మరెన్నో ప్రాణాలకు స్ఫూర్తిని ఇస్తుంటాయి. బాలీవుడ్ గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలో నటించిన అథ్లెటిక్ బయోపిక్ చిత్రం -మేరీ కోమ్- ఎంతటి సంచలనాత్మక విజయం సాధించిందో చెప్పాల్సిన పనిలేదు. తాజాగా ఈ సినిమా దాయాదీ దేశమైన పాకిస్థాన్‌కు చెందిన ఒక యువతి జీవితంలో ఎలాంటి మార్పు తెచ్చిందో తెలిస్తే షాక్ అవ్వాల్సిందే. ప్రస్తుతం ఈ విషయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశవుతోంది. అనుకుంటే ఇలా షాకిచ్చారేంటీ! పాకిస్థాన్ దేశం నుంచి తొలి మహిళా కామన్వెల్త్ గేమ్స్ (జఔ+) బాక్సింగ్ పతక విజేతగా చరిత్ర సృష్టించిన ఫాతిమా జెహ్రా తన విజయానికి అసలు కారణం -మేరీ కోమ్- సినిమానే అని వెల్లడించారు. సాంప్రదాయ కట్టుబాట్లు .. క్రీడలలో మహిళలకు తగినంత ప్రోత్సాహం లేని కఠినమైన వాతావరణం నుంచి వచ్చిన ఫాతిమా చిన్నతనంలో ఈ సినిమాను చూసిన తర్వాతే బాక్సింగ్ వైపు అడుగులు వేశారు. తెరపై మేరీ కోమ్ పడిన కష్టాలు, ఆమె పోరాట పటిమ ఈ యువతిని అమితంగా ఆకట్టుకున్నాయి. సినిమా చూసి స్ఫూర్తి పొందడమే కాకుండా ఫాతిమా జెహ్రా బాక్సింగ్‌ను కెరీర్‌గా ఎంచుకుని కఠినమైన శిక్షణ మొదలు పెట్టారు. సమాజం నుంచి ఎన్నో విమర్శలు, కుటుంబపరమైన సవాళ్లు ఎదురైనప్పటికీ ఫాతిమా వెనకడుగు వేయలేదు. సినిమాలోని రియల్ లైఫ్ పాత్ర తనలో నింపిన ఆత్మవిశ్వాసంతో గ్లోబల్ వేదికలపై పాకిస్థాన్ జెండాను ఎగరేయాలనే కసితో ముందుకు సాగారు. ప్రతిరోజూ జిమ్‌లో చెమటోడ్చిన కష్టం చివరకు ఆమెను ఒక అథ్లెటిక్‌గా దేశం గర్వించదగ్గ స్థాయికి చేర్చింది. అనుకున్నట్లుగానే ఫాతిమా జెహ్రా అంకితభావం ఆమెను అగ్రగామిగా నిలబెట్టింది. కామన్వెల్త్ గేమ్స్ బాక్సింగ్ విభాగంలో పాకిస్థాన్ తరఫున పతకం సాధించిన మొట్టమొదటి మహిళా బాక్సర్‌గా అరుదైన రికార్డును సొంతం చేసుకున్నారు. ఫాతిమా సాధించిన ఈ చారిత్రక విజయం కేవలం ఆమె కుటుంబానికే కాకుండా పాకిస్థాన్‌లోని క్రీడా రంగంలో సరికొత్త చరిత్రను సృష్టించింది. ఒక సినిమా ఒక సాధారణ యువతిని ఏ స్థాయికి తీసుకువెళ్లగలదో? అనడానికి ఫాతిమా ప్రయాణం సజీవ సాక్ష్యంగా నిలిచింది. చివరికిలా ఈ అద్భుతమైన విజయం వెనుక ఉన్న స్ఫూర్తిని గుర్తించిన నెటిజన్లు ప్రియాంక చోప్రా నటనను , ఆ చిత్ర బృందాన్ని ప్రశంసిస్తున్నారు. కళకు, మంచి కథలకు కులమతాలు, సరిహద్దులు లేవని ఈ ఉదంతం మరోసారి నిరూపించింది. కష్టపడే తత్వం ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చు అని ఫాతిమా నిరూపించగా అలాంటి కసిని నింపే శక్తి మంచి సినిమాలకు ఉంటుందని మరోసారి రుజువైంది. అంతర్జాతీయ స్థాయిలో భారతదేశం పేరును గర్వపడేలా చేసిన ఒక సినిమా శత్రు దేశంలో ఇలాంటి విప్లవం సృష్టించడం విశేషం. ముగింపుగా ప్రియాంక చోప్రా నటించిన -మేరీ కోమ్- కమర్షియల్ బయోపిక్‌గా మాత్రమే మిగిలిపోకుండా, సరి హద్దులు దాటి ఒక యువతికి ధైర్యాన్నిచ్చిన అద్భుతమైన శక్తిగా నిలిచింది. ఫాతిమా జెహ్రా సాధించిన విజయం ప్రతి ఒక్కరికీ ఇన్‌స్పిరేషన్. కళా సృష్టి సమాజంలో ఎంతటి సానుకూల మార్పును తీసుకురాగలదో? చెప్పడానికి ఈ సంఘటన చక్కటి నిదర్శనం.

# లవ్, బ్రేకప్ వార్తలపై అనుపమ పరమేశ్వరన్ స్పందన



ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో తమిళ్ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో తన లవ్ లైఫ్, బ్రేకప్ వార్తలపై వస్తున్న ఊహాగానాలపై ఎట్టకేలకు స్పందించింది. నెట్టింట వైరల్ అవుతున్న రూమర్లకు స్వస్తి పలుకుతూ ఆమె చేసిన ఎమోషనల్ కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. గత ఏడాది కాలంగా తన జీవితంలో అనేక ఒడిదుడుకులు, మానసిక సంఘర్షణలు ఎదుర్కొన్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేసింది. ఆ సమయంలో అత్యంత కష్టమైన పరిస్థితులను దాటుకుని ముందుకు రావాల్సి వచ్చిందని తెలిపింది.“గత ఏడాది నా జీవితంలో అత్యంత సంక్లిష్టమైన, కష్టతరమైన ఘట్టం నడిచింది. ఆ కష్టాలను దాటుకుని, ఇప్పుడు మళ్లీ నా జీవితంలో సంతోషం, ప్రశాంతత వైపు అడుగులు వేస్తున్నాను“ అని అనుపమ పేర్కొంది. పరిస్థితులు ఎలా ఉన్నా మనల్ని మనం ప్రేమించుకోవడం, స్వీయ స్వేచ్ఛను ఎంచుకోవడం ఎంతో ముఖ్యమని చెబుతూ... అభిమానులు, శ్రేయోభిలాషులు అందించిన మద్దతుకు ధన్యవాదాలు తెలిపింది.తమిళ యంగ్ హీరో ధ్రువ్ విక్రమ్‌తో ప్రేమాయణం, తదనంతర బ్రేకప్ వార్తలపై మీడియాలో రకరకాల కథనాలు షికారు చేస్తున్న నేపథ్యంలో, ఆమె పరోక్షంగా ఇచ్చిన ఈ స్పష్టతతో ఆ పుకార్లన్నింటికీ తెరపడినట్లయింది.

# అనుపమ ‘క్రేజీ కళ్యాణం‘..

## నవ్వులు పంచే టీజర్ వచ్చేసింది!




ప్రముఖ నటి అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న కొత్త చిత్రం ‘క్రేజీ కల్యాణం‘. భద్రప్ప గాజుల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం చిత్ర యూనిట్ విడుదల చేసింది. నవ్వులు, భావోద్వేగాలు, ఊహించని మలుపులతో కూడిన ఈ టీజర్, ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకులకు అందిస్తామని హామీ ఇస్తోంది.
టీజర్ ప్రారంభంలో.. తండ్రి పాత్రలో నటిస్తున్న డాక్టర్ నరేశ్, తన కూతురు కీర్తి (అనుపమ) పెళ్లిని ఎంత ఘనంగా చేయాలనుకుంటున్నారో ప్రేమగా చెబుతారు. “నీ పెళ్లిని అంగరంగ వైభవంగా జరిపిస్తా“ అంటూ ఆయన చెప్పే మాటలు ఆకట్టుకుంటాయి. అయితే, తండ్రి ఆశలకు భిన్నంగా కీర్తికి వేరే ప్రణాళికలు ఉన్నట్టు తెలుస్తోంది. “నీ కొడుకు ఒక్కడే మొండివాడు అనుకుంటున్నావా? నాలోనూ అదే రక్తం ప్రవహిస్తోంది“ అని నానమ్మతో అనుపమ చెప్పే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది.తన అన్నకు తన పెద్దల్లుడి కంటే దరిద్రుడైన అల్లుడు రావాలని నరేశ్ దేవుడికి మొక్కుకోవడం, మంచంపై పడుకున్న వ్యక్తిపై అనుపమ కారం చల్లడం వంటి సన్నివేశాలు కడుపుబ్బ నవ్విస్తున్నాయి. మొత్తం మీద ఈ టీజర్ ఒక క్రేజీ వెడ్డింగ్ సెలబ్రేషన్‌ను తెరపై చూపిస్తుందనే అంచనాలను పెంచింది.ఈ చిత్రంతో భద్రప్ప గాజుల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యారో సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాలో నరేశ్, తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్ ఉద్దేమరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తుండగా, శ్యామ్ దూపాటి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# చిరంజీవి ‘మెగా 158‘ దర్శకుడి పుట్టినరోజు వేడుకలు..

## బీటీఎస్ వీడియోతో మరింత పెరిగిన హైప్!




మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, దర్శకుడు బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం ‘మెగా 158‘పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ‘వాల్తేరు వీరయ్య‘ వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో మెగా అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. తాజాగా దర్శకుడు బాబీ కొల్లి పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన ఓ స్పెషల్ బిహైండ్ ది సీన్స్ (బీటీఎస్) వీడియో, ఈ అంచనాలను మరింత పెంచేసింది.ప్రస్తుతం ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో విడుదలైన బీటీఎస్ వీడియోలో దర్శకుడు బాబీ పూర్తి ఆత్మవిశ్వాసంతో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్న తీరు ఆకట్టుకుంటోంది. ప్రతి ఫ్రేమ్‌ను జాగ్రత్తగా పరిశీలిస్తూ, యూనిట్ సభ్యులతో ఉత్సాహంగా సంభాషిస్తూ ఆయన చూపిస్తున్న శైలిపై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వీడియో చూశాక సినిమాపై నమ్మకం రెట్టింపు అయిందని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. “ది బ్లడీ బెంచ్‌మార్క్ సెట్ చేయడానికి సిద్ధమవుతున్న దర్శకుడు“ అంటూ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలపడం విశేషం.ఇటీవలే హైదరాబాద్‌లోని ఓ అల్యూమినియం ఫ్యాక్టరీలో ఈ సినిమాకు సంబంధించిన కీలకమైన ఇంటర్వెల్ యాక్షన్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. యాక్షన్ డైరెక్టర్లు రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ నేతృత్వంలో చిరంజీవిపై చిత్రీకరించిన ఈ భారీ యాక్షన్ ఘట్టం అద్భుతంగా వచ్చినట్లు సమాచారం. ఈ సన్నివేశంలో చిరంజీవి నటన, బాబీ టేకింగ్‌కు ముగ్ధులైన చిత్ర యూనిట్ మొత్తం నిలబడి చప్పట్లు కొట్టినట్లు తెలుస్తోంది. సినిమాకే ఈ ఇంటర్వెల్ బ్లాక్ ప్రధాన హైలైట్‌గా నిలుస్తుందని చిత్రవర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.ఈ చిత్రంలో చిరంజీవి సరసన అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, నివేదా పేతురాజ్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. వీరి పాత్రలకు కథలో ఎంతో ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు కానుకగా సినిమా అధికారిక టైటిల్, టీజర్‌ను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతానికి విడుదల తేదీని ప్రకటించనప్పటికీ, 2027 సంక్రాంతికి సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# స్పెయిన్ ఫుట్‌బాల్ స్టార్ యమాల్ కుటుంబాన్ని కలిసిన ఊర్వశీ రౌతేలా..

## - ఆసక్తికర విషయాలు పంచుకున్న నటి



ఫిఫా ప్రపంచకప్ 2026 వేదికగా బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా మరోసారి వార్తల్లో నిలిచారు. స్పెయిన్ ఫుట్‌బాల్ స్టార్, సంచలన ఆటగాడు లామిన్ యమాల్ తల్లి షీలా ఎబానాను ఆమె కలవడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ కలయిక అనంతరం యమాల్ కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని, వారి గొప్పదనాన్ని ఊర్వశీ మీడియాకు వివరించారు. ఈ అనుభవం ఎంతో మధురమైనదని ఆమె పేర్కొన్నారు.యమాల్ తల్లితో భేటీ గురించి ఊర్వశీ మాట్లాడుతూ, “ప్రతి గొప్ప ఛాంపియన్ వెనుక ఒక అద్భుతమైన తల్లి కచ్చితంగా ఉంటుంది. ఫుట్‌బాల్ సంచలనం లామిన్ యమాల్‌ను పెంచి పెద్దచేసిన గొప్ప తల్లిని కలవడం నాకు గర్వంగా, సంతోషంగా ఉంది. మీ కుటుంబం ఎల్లప్పుడూ ఆనందంగా, విజయవంతంగా ఉండాలని కోరుకుంటున్నాను“ అని తెలిపారు. ప్రపంచకప్ మ్యాచ్‌కు ఒకరోజు ముందు యమాల్ కుటుంబ సభ్యులతో తాను రోజంతా గడిపినట్లు ఆమె వెల్లడించారు.ఆ రోజు జరిగిన సంఘటనలను గుర్తుచేసుకుంటూ, “నేను యమాల్ తల్లి, నానమ్మలను కలిశాను. ఆ గదిలో ఉన్న ఉద్విగ్నభరిత వాతావరణాన్ని నేను స్పష్టంగా గమనించాను. అందరిలోనూ ఎంతో ఉత్సాహం ఉంది, కానీ అదే సమయంలో సహజంగా ఉండే ఒత్తిడి కూడా కనిపించింది. ఎందుకంటే అది యమాల్ జీవితంలో ఒక అతిపెద్ద ఘట్టం. అతిపెద్ద వేదికపై ఆడాలన్నది అతని చిన్ననాటి కల. ఆ కల కోసం అతను ఎంత కష్టపడ్డాడో, ఎన్ని త్యాగాలు చేశాడో తెలుసు. అందుకే అంతా సవ్యంగా జరగాలని నేను కూడా అతడి కుటుంబంతో కలిసి ప్రార్థించాను“ అని ఊర్వశీ వివరించారు.
“నిన్న మొన్నటి వరకు అతని కల గురించి మాట్లాడుకున్నాం. మరుసటి రోజే అతను ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచి ఆ కలను నిజం చేసుకున్నాడు. ఒక కల ఇంత త్వరగా వాస్తవరూపం దాల్చడం చూడటం నమ్మశక్యంగా లేదు, కానీ అదొక అద్భుతమైన అనుభూతి“ అని ఆమె సంతోషం వ్యక్తం చేశారు.యమాల్ కుటుంబ సభ్యుల గురించి చెబుతూ, “విజయం తర్వాత వాళ్ల కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం ఆ క్షణాన్ని మరింత అర్థవంతంగా మార్చింది. అతని తల్లి, నానమ్మ ఎంతో ఆప్యాయంగా, ఎలాంటి గర్వం లేకుండా ఉన్నారు. వారితో సమయం గడపడం చాలా బాగుంది. ముఖ్యంగా యమాల్ తమ్ముడు అల్లరితో అందరినీ నవ్విస్తూ ఆ రోజంతా సందడి చేశాడు. ఒక ఛాంపియన్ ప్రయాణంలో ప్రతి అడుగులోనూ అతని వెనుక నిలిచే ప్రేమగల కుటుంబం ఎంత ముఖ్యమో ఈ సంఘటన నాకు మరోసారి గుర్తుచేసింది“ అని ఊర్వశీ పేర్కొన్నారు. అంతకుముందు, తన సోషల్ మీడియా ఖాతాలో యమాల్ తల్లి షీలా ఎబానాతో మాట్లాడుతున్న కొన్ని చిత్రాలను ఊర్వశీ పంచుకున్న విషయం తెలిసిందే.





